# దెయ్యాలు

"ఏం చేస్తున్నావురా యిప్పుడు ? "

"వుండలు."

"అంటే ?"

"మాత్రలు."

"మాత్రలు చేయడమంటే?"

"వైద్యం"

"ఓహొూ !...ఏం వైద్యం ?"

"అన్నిటికీనీ, ముఖ్యం హిస్టీరియాకి !"

"ప్రసిద్ధికెక్కిన హిస్టీరియా గజపంచాననం నువ్వు కాదుకదా !"

"సందేహ మెందుకు ?"

"నువ్వే ! నువ్వే ! ఏమదృష్టంరా !"

"ఎవరికి ?"

"ఎవరికేమిటి ! నీకే !"

"నాకా ?"

"బూకరించకు. నీఖ్యాతిని వినందెవరు?"

"వుత్త ఖ్యాతే! అంతే!"

"డబ్బూ ! ఇంక ఆడవాళ్లూ !"

"ఆడవాళ్ళేమిటి !!!"

"నన్ను డబాయించకు మరి! హిస్టీరియా యెవరికొస్తుందిరా ? ఇంకేం ? అందులో తక్కిన జబ్బులవలె కాదు. హిస్టీరియా కుదర్చాలంటే. రోగితో రాత్రులంతా వొంటరిగా మేలుకు కూచోవాలి. ఆ రోగి చేసే పనులకు ఆ రోగిబాధ్యత వుండదు. వొళ్లు తెలీదు కనక. నిజంగా అంది హిస్టీరియా అవునో కాదో, నువ్వు నిర్ణయించవలసిందేగాని, యింకెవరికీ తెలీదు. వొరే, ఎంత అదృష్టవంతుడివిరా ! మనతో చదువుకున్న సూర్యనారాయణ కలెక్టరయినాడు; వెంకటేశ్వర్లు ఆ లక్షరూపాయల పిల్లతో లేచిపోయినాడు; రామనాథం సినామా తార ఐనాడు. వాళ్ళు ముగ్గురే అదృష్టవంతులు మనజట్టులో అనుకుంటున్నా. కాని నీ ముందు-"

"అట్లానే అనుకోరా!"

"ను వ్వెన్ని చెప్పినా నమ్మను. నాకు తెలుసు. నీ కీర్తి చాలా విన్నాను. ఆడవాళ్లసంగతి అబద్దమంటావా?"

"అనను. కాని ఆడవాళ్ళు అదృష్టమంటే వొప్పుకోను."

"అట్లాగా ! నువ్వు నిప్రయోజకుడి వనుకోలేదు నేను."

"అదికాదురా...."

"పోరా, దొంగమాటలూ నువ్వూను ! చిన్నప్పుడూ అంతే! పరీక్ష శుభ్రంగా వ్రాసివొచ్చి, ఏమీ వ్రాయలేదని దొంగ యేడుపులు ఏడ్చేవాడివి ! నాకు తెలుసులేరా."

"ఏం తెలుసు నీకు? నీ మొహం తెలుసు. లోకంలో మనుష్యులు తెలుసునను కునేవన్నీ యింతేననుకో, మొన్నజరిగిన ఓ కేసు సంగతి విను. నీకే తెలుస్తుంది. ఆ ఆడవాళ్లూ అద్రుష్టమూ ఏమిటో? వింటావా?"

"కానీ"

"ఆ వూళ్ళో...."

"ఏవూళ్ళో?"

"ఏదోవొకవూరు. నీకెందుకు? వెడదామన్నా లాభంలేదు. హిస్టీరియా స్పెషలిస్టువైతే తప్ప.

"ఆవూళ్ళో...."

"చూశావా? రహస్యం అప్పుడే."

"ఏడిశావులే! విను ముందు. ఆ వూళో ఓ వర్తకుడి భార్యకి హిస్టీరియా. ఎక్కడా ఎవరిచాతా నయం కాకపోతే, నాకీర్తి విని నన్ను తీసికెళ్ళారు. నా థియరీ యేమిటంటే, హిస్టీరియాకి యెప్పుడూ భర్త బాధ్యుడని. కనక...."

"వుండు. భర్తలేని వాళ్ళకీ వొస్తుందే!"

"భర్తలేకపోడం, భర్త తప్పేగా!"

"బావుంది. కానీ..."

"కాపరానికి వొచ్చిన మూడేళ్ళనుంచీ జబ్బే. ఆభర్త అర్భకత్వం చూసేప్పటికే రోగం కారణం అర్థమయింది నాకు. వొంటరిగా రోగిని గదిలో బంధించి 'ట్రీట్' చేసి, నయంచేశాను. నాకు మంచి ఫీజు యిచ్చాడావర్తకుడు."

"ఇంకేం? అదే నేను...."

"విను మరి. కథ ముగియలేదు. కాని వారానికే మళ్ళీ ఫిట్ వొచ్చి నన్ను పిలిపించారు. మళ్ళీ అంతట్లో జబ్బు తిరగాపెడుతుం దనుకోలేదు. ఏం చెయ్యను? వెళ్ళి నయంచేశాను. అటుతరువాత రోజువిడిచి రోజు ఫిట్ రావడం ప్రారంభించింది. నేను వెళ్ళి మంత్రిస్తేనేగాని నయంకాదు. ఎన్నివారాలైనా ఆ కేసు ఆఖరుకాదు. ఆ పిల్లకి పట్టిన దెయ్యంతో తంటాలు పడుతూవుండగానే, ఆమె ఆడబిడ్డ - ముప్పైయేళ్ళ వితంతువు-ఆమెకి దెయ్యం పట్టింది."

"అదే నేననేది,...."

"నోరు ముయ్యి, విను."

"ఏం చెయ్యను ? అదో తమాషా ! యీామెకి ఫిట్ వొచ్చినప్పుడే ఆమెకి ఆవేశం; ఆమెకి ఆవేశం పూనిప్పుడే యీామెకి ఫిట్ ! చూశావా ! మరి వైద్యమంటే తడాఖా ! స్కూల్లో కుర్చీలో కునికిపాట్లు పడడమనుకున్నావా యేమిటి?"

"ఏం చేశావు ?"

"చెరోగదిలో పెట్టి...."

"ఒక గదిలోనే పెడితేనేం ?"

"ఈ దెయ్యమూ, హిస్టీరియా ఒకదాన్ని ఒకటి పీక్కుతినెయ్యవూ ?"

"అర్థమయింది. నీపని కష్టమే! ఒకసారి రెండు కేసులొస్తే !"

"రెండా ! ఒక్కొక్కవూళ్ళో ఒక్కసారే పన్నెండు వుండేవి."

"అబ్బా ! అ దేవూళ్ళో బాబా !"

"ఏదో వూరులే"

"పోనీ, నన్ను అసిస్టుంటుగా వేసుకోరాదూ ?"

"విను ముందు. విన్నతరవాత నీ టీచరుపనికి రాజీనామా పెట్టడం యోచించవచ్చు. చెరోగదిలో పెట్టి యిక్కడ మంత్రం, అక్కడ మందూ; యిక్కడ మందూ, అక్కడ మంత్రం పెట్టుకుంటో పరుగెత్తాలి. ముఖ్యంగా ఆ ఆడబిడ్డ దెయ్యముందే, అది మహాగట్టిది; చాలాకష్టం వొదల్చడం.

"చాలా యిరుకైన స్థానాన పట్టింది. అరగంటైనా స్వాధీనంగాదు. నన్నక్కణ్ణించి కదలనివ్వదు. మీదపడుతుంది. రక్కుతుంది, పీకుతుంది, బట్టలు చించిపారేస్తుంది. రోజా వెళ్ళడం, నయంచేసి రావడం కుదరవు. కేసులు వొదులుకుంటే పేరు పోతుంది. మరి తక్కిన కేసులూ, నాసంసారం చూసుకునేందుకు వ్యవధీ, శక్తీ వుండాలా? రాత్రి సగం నిద్రలోనూ, మద్యాన్నం అలిసిపడుకున్నా, అతని సన్నని కీచుగొంతు, 'డాక్టరుగారూ, మళ్ళీ దెయ్యం' అనేప్పటికల్లా, నాప్రాణాలు యెగిరిపొయ్యేవి. ఆఖరికి యీా వొత్తిడితో నాకే

జబ్బుచేసేట్టు తోచి, ఆ వర్తకుడికి ఒక వుపాయం చెప్పాను. ఈవుపాయాల్లోనే వుంది తెలివంతా.

"మీ యింటో మొగదక్షత లేక, దెయ్యాలకి చులకనయింది. నీ భార్యది కూడా ఒకవిధంగా దెయ్యమే. కనక మీ యింటో ఒక గది-వరండాలోది కాదు, ఇంటిమధ్యది- నలుగురు ధైర్యమూ, బలమూ, గల కాలేజి కుర్రవాళ్ళకి అద్దెకిచ్చావంటే, యింక దెయ్యా లావేపు రావు. హడిలి పారిపోతా"యన్నాను.

బుద్ధిమంతుల్ని, నీతిప్రవర్తన గలవారినీ మీరే కుదిర్చి పెట్టమన్నాడు.

మరి నాకు అంతఫీజు యిచ్చిన వాడి ప్రార్థనని ఎట్లా నిరాకరించను? కుర్రవాళ్ళని యేర్పరిచి, మళ్ళీ దెయ్యాలు ఆవేపు చేరకుండా, ఆంజనేయమంత్రం వాళ్ళ కుపదేశించి, ప్రవేశపెట్టాను. అంతటితో 'దేవుడా బైటపడ్డా'నని యితర కేసులు చూచుకుంటున్నాను."

"కథ బావుందిగాని-"

"ఐపోందే! ఒక్క రాత్రి మళ్ళీ ఆ వర్తకుడు వొచ్చాడయ్యా"

"వొచ్చి ?"

"మళ్ళీ దెయ్యం వొచ్చిందండీ !" అన్నాడు.

"అరే ! నేను కావిలిపెట్టినవాళ్ళు-" అన్నాను.

"వున్నారు. మీధర్మమా అని అప్పణ్ణించి వాళ్ళిద్దరూ చాలా కులాసాగా వున్నారు. కాని యీసారి.....మా తల్లికి....."

నాగుండె ఆగింది. చచ్చా ననుకున్నాను.

ఆ తల్లికి అరవైయేళ్ళు, అంత ముసలిదానికి ఏ డాక్టరు మందియ్యగలడు చెప్పు ? ఏం తోచలేదు. తెల్లారేప్పటికి మందు తయారు చేసుకొస్తానని చెప్పి ఆ రాత్రే ఆవూరూ, ఐదారు చక్కని కేసులూ వొదులుకుని, పలాయన మైనానను. ఏం ? నా అసిస్టంటుగా వొస్తావా ? ఇంకా ఆ ముసలామెకి-"

స్నేహితుడు ఆ చుట్టు పక్కల కనిపించలేదు.

◆ ◆ ◆

*ప్రచురణ : (విచిత్రనళీయం కథలు), ఎమెస్కో ప్రచురణ, 1967*